నమస్తే తెలంగాణ



# ఏపీ ఇష్టారాజ్యం.. కాంగ్రెస్ చోద్యం

- యథేచ్ఛగా కృష్ణా జలాలు తరలుతున్నా కన్నెత్తి చూడని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం
- సాగర్ కుడికాలువ ద్వారా 646 టీఎంసీలను ఏపీ అక్రమంగా మళ్లిస్తున్నా చలనం లేదు
- నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఏర్పడ్డ తెలంగాణను హస్తం పార్టీ ముంచుతున్నది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్



హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తేతెలంగాణ) : కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యథేచ్ఛగా తరలించుకుపోతుంటే తెలంగాణలోని కాంగ్రెస్ సర్కారు చోద్యం చూస్తున్నదని కేటీఆర్ విమర్శించారు. మూడు నెలలుగా సాగర్ కుడికాలువ ద్వారా 646 టీఎంసీలను ఏపీ అక్రమంగా మళ్లిస్తుంటే రేవంత్ ప్రభుత్వంలో చలనంలేకపోవడం విడ్డూరమని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో కృష్ణ, గోదావరి నదీజలాలను మళ్లించి తెలంగాణలోని బీడు భూములను సస్యశ్యామలం చేశామని ఆదివారం ఎక్స్ వేదికగా గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ ఏడాది పాలనలో పంటపొలాలను ఎండబెట్టిందని విమర్శించారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఏర్పడ్డ తెలంగాణను హస్తం పార్టీ నిండా ముంచుతున్నదని దుయ్యబట్టారు. వచ్చే వేసవిలో ఎదురయ్యే తాగు, సాగునీటి సమస్యలపై దృష్టిపెట్టకుండా ముఖ్యమంత్రి ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. సాగర్, శ్రీశైలం నుంచి ఏపీ నీటి చౌర్యానికి పాల్పడుతున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమని, ప్రాజెక్టుల్లో నీళ్లు అడుగంటి పంట పొలాలు ఎండుతున్నా నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.

### టెక్ ఇన్నోవేషన్ సమ్మిట్‌కు కేటీఆర్‌కు ఆహ్వానం

కేటీఆర్‌కు మరో అరుదైన గౌరవం దక్కింది. బెంగళూరులో నిర్వహించే 'టెక్ అండ్ ఇన్నోవేషన్ సమ్మిట్ 2025'కు ముఖ్యఅతిథిగా హాజరై కీలక ప్రసంగం చేయాలని ఆహ్వానం అందింది. ఈనెల 27, 28న 'ఎంట్రప్రెన్యూర్ ఇండియా' ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనున్నది. సదస్సు తొలి రోజు డ్రైవింగ్ డిజిటల్ ఇండియాలో భాగంగా 'ఇన్నొవేషన్స్ అండ్ స్ట్రాటజీస్ ఫర్ ఏ టెక్నలాజికల్లీ అడ్వాన్స్‌డ్ ఫ్యూచర్' అనే అంశంపై కేటీఆర్ ప్రసంగించనున్నారు. ఈ సమ్మిట్‌లో 'కృత్రిమ మేధస్సు వ్యాపారం.. సాంకేతికతపై చూపించే ప్రభావం'పై ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, వివిధ ప్రభుత్వాల ప్రతినిధులు చర్చించనున్నారు. సదస్సులో 'గాలా ఐడియా అవార్డ్స్' కార్యక్రమం చేపట్టనున్నారు.



దేవాదుల పంప్ హౌస్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

## దేవాదుల మోటర్లు బంద్ చేయాలని రైతుల నిరసన

- చలివాగులో నీళ్లు అడుగంటుతున్నాయని ఆందోళన

శాయంపేట, ఫిబ్రవరి 16 : హనుమకొండ జిల్లా శాయంపేట మండలం జోగంపల్లి శివారులో ఉన్న చలివాగు ప్రాజెక్టు దేవాదుల పంపుహౌస్ వద్ద ఆదివారం రైతులు నిరసన తెలిపారు. దేవాదుల పంప్‌హౌస్ నుంచి ధర్మసాగర్‌కు నిరంతరం నీటిని పంపిణీ చేస్తుండటంతో చలివాగులో బ్యాక్ వాటర్ అడుగంటి పోతున్నాయని ఆందోళన చేపట్టారు. చలి వాగు పరిసర ప్రాంతాలైన హుస్సేన్‌పల్లి, మైలారం, వసంతాపూర్, పత్తిపాక తదితర గ్రామాల రైతులు చలివాగు పంప్‌హౌస్ వద్దకు చేరుకొని దేవాదుల మోటర్లను ఆఫ్ చేయాలని నిరసనకు దిగారు.

# ఏపీ జల దోపిడీ!

మొదటిపేజీ తరువాయి...

చేతులెత్తేసింది. కృష్ణా నదీ జలాల్లో ఏపీ తాత్కాలిక కోటా 512 టీఎంసీలు. కానీ, ఇప్పటికే 646 టీఎంసీలను మళ్లించుకుపోయింది. జనవరి 21వ తేదీ వరకు 590 టీఎంసీలను తరలించుపోగా, గత 25 రోజుల్లోనే 60 టీఎంసీలను మళ్లించుకుపోయిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. రోజుకు దాదాపు 2 టీఎంసీలకు మించి జలాలను ఏపీ మళ్లిస్తున్నది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒక్క పోతిరెడ్డిపాడు ద్వారానే ఎనిమిది నెలల్లో 240 టీఎంసీలకుపైగా పెన్నా బేసిన్‌కు తరలించింది. పెన్నా బేసిన్‌లో దాదాపు 350 టీఎంసీలను ఇప్పటికే నిల్వ చేసింది. అంతేకాకుండా, హెచ్ఎన్ఎస్ఎస్, జీఎన్ఎస్ఎస్, ముచ్చుమర్రి, మల్యాల తదితర ఎత్తిపోతల ద్వారా కూడా జలాలను తరలించింది. దిగువన నాగార్జునసాగర్ వద్ద కుడికాలువ, పంప్‌హౌజ్ ద్వారా కూడా కృష్ణా జలాలను ఏపీ నిరంతరాయంగా తరలిస్తూనే ఉన్నది. మొత్తంగా ఈ ఏడాది ఇప్పటివరకు 646 టీఎంసీలకుపైగా జలాలను ఏపీ తరలించినట్టు అధికారిక గణాంకాలే వెల్లడిస్తున్నాయి. మళ్లిస్తున్న జలాలకు సంబంధించిన లెక్కలను కూడా ఖచ్చితంగా వెల్లడించని దుస్థితి నెలకొన్నది. నీటి గణాంకాల వివరాలను కూడా సరిగా నమోదు చేయడం లేదు.



### వేసవికి ముందే రిజర్వాయర్లు ఖాళీ!

ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిశాయి. కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులన్నీ పొంగిపొర్లాయి. అక్టోబర్ 25 నాటికి శ్రీశైలం రిజర్వాయర్ 215 టీఎంసీలతో కళకళలాడింది. కానీ, ప్రస్తుతం వేసవి రాకముందే పరిస్థితి తారుమారవుతున్నది. శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్లలో నీటినిల్వలు అడుగంటి పోయాయి. ఇప్పటికే శ్రీశైలం రిజర్వాయర్‌ను ఏపీ సర్కార్ ఖాళీ చేసింది. శ్రీశైలంలో ప్రస్తుతం 82 టీఎంసీలే ఉండటం గమనార్హం. ఇందులో డెడ్‌స్టోరేజీ కింద 54 టీఎంసీలను తీసేస్తే, ఇక అందుబాటులో ఉన్నవి 28 టీఎంసీలే. రిజర్వాయర్‌పై ఆధారపడి ఉమ్మడి మహబూబ్‌నగర్‌తోపాటు మొత్తంగా ఏడు జిల్లాలకు సాగునీరు అందించాల్సి ఉన్నది. యాసంగి తాగునీటి అవసరాలను కూడా తీర్చాల్సి ఉన్నది. నాగార్జునసాగర్‌లోనూ ప్రస్తుతం 180 టీఎంసీలే ఉన్నాయి. ఇందులో డెడ్‌స్టోరేజీ కింద 131 టీఎంసీలు మినహాయిస్తే అందుబాటులో నిండా 50 టీఎంసీలు కూడా లేవు. ఈ విధంగా రెండు రిజర్వాయర్లలో కలిపి నికరంగా 78 టీఎంసీలు కూడా లేవు. మరోవైపు సాగర్ ఎడమ కాలువ కింద 6.5 లక్షల ఆయకట్టుతోపాటు హైదరాబాద్ సహా ఇతర జిల్లాల తాగునీటి అవసరాలు తీర్చాల్సి ఉన్నది. సాగర్ కుడి కాలువ నుంచి ఏపీ గత మూడు నెలలుగా నికరంగా రోజుకు 10 వేల క్యూసెక్కులను నిరంతరాయంగా తరలించిపోతున్నది. ఈ ఏడాది పొంగిన కృష్ణమ్మను ఏపీ అడ్డంగా మళ్లించుకుపోయింది.

### త్రిసభ్య కమిటీ సమావేశం ఊసేలేదు

ఏపీ అడ్డూ అదుపు లేకుండా రిజర్వాయర్ల నుంచి అనుమతి లేని ఔట్‌లెట్ల ద్వారా జలాలను తరలించుకుపోతున్నా కేఆర్ఎంబీ నోరెత్తడం లేదు. వాస్తవంగా ప్రతి నీటి సంవత్సరం అంటే జూన్ నుంచి మే 31వ తేదీ వరకు ఉమ్మడి రిజర్వాయర్లలో నీటినిల్వలను ఏ రాష్ట్రం, ఏ మేరకు వినియోగించుకోవాలనేది త్రిసభ్య కమిటీ నిర్ణయిస్తుంది. బోర్డు మెంబర్ సెక్రటరీ, ఇరు రాష్ట్రాల ఈఎన్సీ (ఇంజినీర్ ఇన్ చీఫ్)లతో కూడిన ఈ కమిటీ ఏటా సీజన్ల వారీగా ఎప్పటికప్పుడు సమావేశాలను ఏర్పాటుచేస్తుంది. రాష్ట్రాల డిమాండ్లను, అందుబాటులో ఉన్న నీటినిల్వలను పరిగణనలోకి తీసుకొని ఇరు రాష్ట్రాలకు నీటి వాటాలను కేటాయిస్తుంది. కానీ, ఈ ఏడాది యాసంగి సీజన్ ప్రారంభమైనా, నీటి సంవత్సరం ముగిసేందుకు మరో నాలుగు నెలల సమయమే ఉన్నా ఇప్పటికీ త్రిసభ్య కమిటీ సమావేశం జరగలేదు. గత నెల 21న నిర్వహించిన బోర్డు సమావేశంలోనూ నీటివాటాలపై చర్చించలేదు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగినంతగా లేవని, వచ్చే ఏడాది వరకు తాగునీటి అవసరాలు ఉన్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవాలంటూ ఉచిత సలహాలు ఇస్తున్న కేఆర్ఎంబీ ఏపీని మాత్రం నిలువరించడం లేదు.

## నీటి వినియోగంలో రేవంత్ సర్కార్ విఫలం

ఒకవైపు నాగార్జునసాగర్ ఎడమకాలువకు సంబంధించిన చివరి ఆయకట్టు రైతులు సాగునీరు సరిగా అందడం లేదని ఆందోళనకు దిగుతున్నారు. మరోవైపు, ఏపీ యథేచ్ఛగా నీటిని తరలించుకుపోతున్నది. బోర్డు సైతం ఏపీ సర్కార్‌కు అనుకూలంగా చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నది. ఇంతజరుగుతున్నా రేవంత్ సర్కార్ నోరెత్తడం లేదు. ఏపీని నిలువరించేందుకు ప్రయత్నించడంలేదు. త్రిసభ్య కమిటీ సమావేశం కోసం బోర్డుపై ఒత్తిడి తేవడంలేదు. కృష్ణమ్మను ఒడిసిపట్టడంలోనూ, జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలనే ఆలోచన కూడా రేవంత్ సర్కార్‌కు లేకుండా పోయింది. ఏపీ 650పైగా టీఎంసీలను తరలించుకుపోగా, తెలంగాణ సర్కార్ 210 టీఎంసీలను మాత్రమే వినియోగించుకున్నది. శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్ల నుంచి ఎంతమేరకు సాధ్యమైతే అంతమేరకు కృష్ణా జలాలను తరలిస్తూ, రిజర్వాయర్లను ఏపీ నింపుకుంటుండగా తెలంగాణ సర్కార్ మాత్రం మొద్దునిద్ర పోతున్నదని నీటిరంగ నిపుణులు మండిపడుతున్నారు. సాగర్ ఎడమకాలువ పూర్తిస్థాయి సామర్థ్యం ఎనిమిది వేల క్యూసెక్కులు కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు గరిష్ఠంగా ఆరువేల క్యూసెక్కులకు మించి నీటిని విడుదల చేయడం లేదని చెప్తున్నారు. ఎడమకాలువతో అనుసంధానించిన చెరువులను నింపే అవకాశం ఉన్నా ప్రభుత్వం ఆ పని కూడా చేయడం లేదని రైతాంగం మండిపడుతున్నది. ఏపీని కట్టడి చేయడంలోనే కాదు కృష్ణా జలాలను ఒడిసిపట్టే అంశంలోనూ సర్కార్ అడుగడుగునా విఫలమైంది. ప్రభుత్వం స్పందించకపోతే వేసవి కష్టాలు తప్పవని నీటిరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు.



## కాంగ్రెస్ సర్కారు కండ్లు తెరవాలి

- ఏపీ జలదోపిడీని అడ్డుకోవాలె
- రేవంత్ ప్రభుత్వం మౌనంతో తెలంగాణ రైతులకు అన్యాయం
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ) : నాగార్జునసాగర్ కుడికాలువ నుంచి ఏపీ ప్రభుత్వం రోజూ 10 వేల క్యూసెక్కుల నీటిని తరలించుకుపోతుంటే తెలంగాణ ప్రభుత్వం మౌనం వహిస్తూ రాష్ట్ర రైతాంగానికి తీరని అన్యాయం చేస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఏపీ యథేచ్ఛగా ఏడాదిలో 646 టీఎంసీలను తరలించి తెలంగాణ ప్రయోజనాలకు గండికొడితే సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం కండ్లు తెరిచి ఏపీ జల దోపిడీని అడ్డుకోవాలని ఆదివారం ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. కేంద్ర బలగాల ఆధీనంలో ఉన్న సాగర్ ఆనకట్ట నుంచి ఏపీ దుర్మార్గంగా నీటిని తీసుకెళ్తున్నదని ఫైర్ అయ్యారు. తెలంగాణ నీటి అవసరాల కోసం శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో నిల్వ ఉంచిన నీటి కోటాను ఏపీ కొల్లగొడుతుంటే కాంగ్రెస్ సర్కారుకు చీమకుట్టినట్టయినా లేకపోవడం విడ్డూరమని మండిపడ్డారు. ఉమ్మడి ప్రాజెక్టుల్లో నీటి వినియోగంపై కేఆర్ఎంబీ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించాల్సిన త్రిసభ్య కమిటీ సమావేశం ఇంతవరకు ఎందుకు పెట్టలేదని నిలదీశారు. ఈ విషయంలో కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. సాగర్, శ్రీశైలం ఆయకట్టు పరిధిలోని రైతులు నీళ్ల కోసం అల్లాడుతుంటే ప్రభుత్వం మాత్రం తెలంగాణ నీటి హక్కులను ఆంధ్రాకు కట్టబెడుతున్నదని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సాగర్ నుంచి ఏపీ నీటి తరలింపును నిలువరించకుంటే హైదరాబాద్‌వాసులు సైతం తాగునీటి కోసం అల్లాడే పరిస్థితులు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు.

# ఐఏఎస్‌లకు ఏసీ జబ్బు!

మొదటిపేజీ తరువాయి...

> నాటి సివిల్ సర్వెంట్ అధికారులతో పోల్చితే నేటి అధికారుల పనితీరులో చాలా తేడా ఉన్నది. శంకరన్, శేషన్, మన్మోహన్‌సింగ్ లాంటి వాళ్లు ఎంతో కష్టపడి, ఎన్నో త్యాగాలు చేసి దేశాన్ని ఓ స్థాయిలో నిలిపారు. వాళ్ల పేర్లు కూడా కొత్తగా వస్తున్న సివిల్ సర్వెంట్స్‌కు గుర్తుండటం లేదు. ఇప్పటి అధికారులు ఏసీ రూముల్లోంచి బయటకు వెళ్లేందుకే నిరాకరిస్తున్నరు. ఏసీ అనేది ఏమైనా వ్యాధో? ఏమో?
> — సీఎం రేవంత్‌రెడ్డి

సీఎం మాట్లాడుతూ గతంలో సివిల్ సర్వెంట్స్ ఎన్నో త్యాగాలు చేసి దేశాన్ని ఈ స్థాయిలో ఉంచారని, కానీ ఇప్పుడు వస్తున్న వారు సమాజంలో ఉన్న చెడునంతా రోల్‌మాడల్‌గా తీసుకుంటున్నారని తెలిపారు. కొత్తగా సెలెక్ట్ అయిన ఐఏఎస్, ఐపీఎస్‌లను తాను చూస్తున్నానని, ట్రైనింగ్‌లో ఉండగానే సివిల్ పంచాయితీలు తెంచుతున్నారని, ఇది చాలా దురదృష్టకరమని విమర్శించారు. నాటి సివిల్ సర్వెంట్ అధికారులతో పోలిస్తే నేటి అధికారుల పనితీరులో చాలా తేడా ఉన్నదని చెప్పారు. తాము ఒక్క తప్పు చేయాలని చెప్తే వాళ్లు మూడు తప్పులు చేద్దామంటున్నారని, ఇది సమాజానికి మంచిది కాదని హితవుపలికారు. అధికారులు ఏసీ రూముల్లోంచి బయటకు వెళ్లేందుకే నిరాకరిస్తున్నారని, ఏసీ అనేది ఏమైనా వ్యాధి ఏమో అని సెటైర్ వేశారు. ప్రస్తుత అధికారుల పనితీరుపై సంతృప్తిగా లేనని స్పష్టం చేశారు. ఈ విషయం చెప్పక తప్పడం లేదని, ఇప్పటికైనా అధికారుల ఆలోచన, పనితీరు మారాలని, ప్రజలకు చేరువై పని చేయాలని సూచించారు.

> కొత్త ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు సమాజంలో మంచిని కాకుండా చెడునే రోల్ మోడల్‌గా తీసుకుంటున్నరు. మేము ఒక్క తప్పు చేయాలని చెప్తే.. ఒకటెందుకు సార్ మూడు చేద్దాం. మళ్లీ మళ్లీ చేయడం ఎందుకు? అన్నీ ఒకేసారి చేద్దాం.. బాగుంటుంది.. బలంగా ఉంటుంది. మళ్లీ రేపు కొత్తగా మూడు తప్పులు చేయొచ్చు అన్నట్టుగా ఉంటున్నరు. ఇది సమాజానికి మంచిది కాదు. ఐపీఎస్‌లు ట్రైనింగ్‌లోనే పోలీస్ స్టేషన్లకు వెళ్లి సివిల్ పంచాయితీలు తెంచుతున్నరు. ఇది చాలా దురదృష్టకరం.
> — సీఎం రేవంత్‌రెడ్డి

## ఇంటింటి రీసర్వే మొదలు

- పాల్గొనని వారికి అవకాశం
- ప్రజల నుంచి అరకొరగానే స్పందన

హైదరాబాద్, ఫిబ్రవరి16 (నమస్తే తెలంగాణ): ఇంటింటి సర్వేలో పాల్గొనని వారికోసం ప్రభుత్వం రీసర్వేను ఆదివారం ప్రారంభించి, ఈ నెల 28 వరకు వివరాల నమోదుకు అవకాశాన్ని కల్పించింది. ఇటీవల నిర్వహించిన సర్వేలో రాష్ట్రవ్యాప్తంగా 3.1% మంది వివరాలను నమోదు చేసుకోలేదు. వారికోసం ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించి టోల్ ఫ్రీ నంబర్ 040 21111111ను కూడా ఏర్పాటు చేసింది. మండల కార్యాలయాల్లోని ప్రజాపాలన కేంద్రాలు, ఆన్‌లైన్ ద్వారా కూడా కుటుంబ వివరాలు నమోదు చేసుకునే అవకాశాన్ని ఇచ్చింది. రీ సర్వేకు ప్రజల నుంచి పెద్దగా స్పందన లేదని అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి.

## హెడ్‌కానిస్టేబుల్ ఆత్మహత్య



పవన్‌నాయుడు (ఫైల్)

ఎర్రవల్లి చౌరస్తా, ఫిబ్రవరి 16: జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి పదో బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్సై వెంకటేశ్, స్థానికుల కథనం మేరకు.. నంద్యాల జిల్లా నందికొట్కూర్ పగిడాలకు చెందిన పవన్‌నాయుడు (34) పదో బెటాలియన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోగా కుటుంబ సభ్యులు గద్వాల దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు తెలిపారు.

## గోకారం రిజర్వాయర్ సామర్థ్యాన్ని తగ్గించాలి

- న్యాయం చేయకపోతే స్థానిక ఎన్నికలను బహిష్కరిస్తాం

చారకొండ, ఫిబ్రవరి 16 : డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం గోకారంలో నిర్మిస్తున్న రిజర్వాయర్ సామర్థ్యాన్ని తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గ్రామస్థులు ర్యాలీ నిర్వహించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను మూకుమ్మడిగా బహిష్కరిస్తామని హెచ్చరించారు.

# డంప్‌యార్డుపై ఆందోళన ఉధృతం

- హైవేపై కదం తొక్కిన మహిళలు
- సంఘీభావం తెలిపిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- బాధిత గ్రామాల్లో జోరుగా ఆందోళనలు
- గుమ్మడిదలలో 6వ రోజు, నల్లవల్లి, కొత్తపల్లిలో 12వ రోజు దీక్షలు
- హైవేపై యువకుల భారీ బైక్‌ర్యాలీ

గుమ్మడిదల, ఫిబ్రవరి 16: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటును వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ కొంతకాలంగా ఆందోళనలు ఉధృతంగా సాగుతున్నాయి. ఆదివారం కూడా నిరసనలు చేపట్టారు. గుమ్మడిదలలో రైతు జేఏసీ కమిటీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అఖిపక్ష నాయకులు, రైతు సంఘాలు, మహిళా సంఘాల సభ్యులు జాతీయ రహదారి-765డీపై భారీ ర్యాలీ నిర్వహించారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చినా పనులు చేపట్టడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. డంపింగ్ యార్డు వద్దకు మహిళలు ర్యాలీగా వెళ్లారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అక్కడికి చేరుకుని వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులతో నిరసనకారులకు మధ్య తోపులాట జరిగింది. 'జై జవాన్.. జై కిసాన్, సేవ్ ఫారెస్ట్, సేవ్ ఫార్మర్' నినాదాలు మిన్నంటాయి. మహిళలు డంపింగ్ యార్డు వైపు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు.



డంప్‌యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా గుమ్మడిదలలో జాతీయ రహదారిపై బైఠాయించిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మహిళలు, జేఏసీ నాయకులు

### డంపింగ్‌యార్డును వెంటనే రద్దు చేయాలి: ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

డంపింగ్ యార్డు ఏర్పాటు అనుమతులను వెంటనే రద్దు చేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనకు మద్దతు ప్రకటించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. భూసర్వే చేసే వరకు పనులు నిలిపి వేయాలని హైకోర్టు ఆదేశించిన విషయాన్ని గుర్తుచేశారు. డంపింగ్ యార్డు పనులు జరుగుతున్నాయా? లేక నిలిపివేశారా? అనే విషయంలో నిర్మాణ సంస్థ రాంకీ స్పష్టత ఇవ్వాలని, ఆందోళన చేస్తున్నవారికి డంపింగ్ యార్డు పనులు ఆపింది లేనిది చూపించాల్సిన బాధ్యత లేదా అని ప్రశ్నించారు. డంపింగ్ యార్డులోకి అనుమతించక పోవడంపై పలు అనుమానాలు, అపోహలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. 12 రోజులుగా పనులు వదులుకుని నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్, గుమ్మడిదల, దోమడుగు, బొంతపల్లి తదితర గ్రామాల ప్రజలు ఆందోళనలు చేస్తున్నా, ప్రభుత్వం స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం జీహెచ్ఎంసీ అధికారులతో చర్చించి డంపింగ్‌యార్డు అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డు చెత్త కంపుతో పచ్చని పల్లెల్లో పర్యావరణానికి విఘాతం కలుగుతుందని, భూగర్భ జలాలను, అడవులను, పంటలను నాశనం చేయొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

### యువకుల బైక్ ర్యాలీ

డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా ఆదివారం జాతీయ రహదారిపై యువకులు పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీ నిర్వహించారు. గుమ్మడిదల నుంచి అన్నారం, ప్రకృతి నివాస్ వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. నల్లవల్లి, కొత్తపల్లిలో రిలే నిరాహార దీక్షలు 12వ రోజుకు చేరాయి. దోమడుగు, బొంతపల్లి గ్రామాల జేఏసీల ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డంపింగ్‌యార్డు అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## మరో మాజీ సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

- బిల్లులు రాక అప్పులబాధతో మనస్తాపం
- పురుగుల మందుతాగిన దళిత మాజీ సర్పంచ్
- దవాఖానలో చికిత్స.. వికారాబాద్‌లో ఘటన
- సర్కార్ వైఖరితో మాజీలకు ప్రాణగండం:రాజిరెడ్డి

బషీరాబాద్, ఫిబ్రవరి 16: కాంగ్రెస్ సర్కార్ మొండివైఖరితో మాజీ సర్పంచులు సతమతం అవుతున్నారు. చేసిన పనులకు బిల్లులు రాక, అప్పులభారం అధికమై ప్రాణాలమీదికి తెచ్చుకోవాల్సిన దుస్థితి దాపురిస్తున్నది. వికారాబాద్ జిల్లాలో ఆదివారం దళిత మాజీ సర్పంచ్ ఆత్మహత్యకు యత్నించిన ఘటన చోటు చేసుకున్నది. బషీరాబాద్ మండలం కాశీంపూర్ గ్రామానికి చెందిన వెంకటప్ప 2019లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచుగా గెలుపొందారు. గ్రామాభివృద్ధిలో భాగంగా రూ.6 లక్షల పంచాయతీ నిధులతో గ్రామంలో మురుగు కాల్వలు, సీసీ రోడ్లు, పైపులైన్ లీకేజీ పనులు చేయించారు. ఆయా పనులు చేసి దాదాపు మూడేండ్లు గడిచినా నిధులు రాకపోవడంతో అప్పులభారం పెరిగింది. దీంతో మనస్తాపానికి గురైన వెంకటప్ప ఆదివారం గ్రామ శివారులోని ఓ వ్యవసాయ పొలం వద్ద పురుగుల తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ విషయాన్ని ఫోన్ ద్వారా పంచాయతీ కార్మికులకు తెలపడంతో వారు ఆయన కుటుంబీకులకు చెప్పారు. దీంతో అతడిని హుటాహుటిన తాండూరు జిల్లా దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉన్నదని చెప్పడంతో వికారాబాద్ మిషన్ దవాఖానకు తరలించారు.

### ప్రభుత్వ మొండివైఖరే కారణం: సర్పంచుల సంఘం నేత రాజిరెడ్డి

రాష్ట్ర ప్రభుత్వ మొండివైఖరే కాశీంపూర్ మాజీ సర్పంచ్ వెంకటప్ప ఆత్మహత్యయత్నానికి కారణామని రాష్ట్ర సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ నేత రాజిరెడ్డి విమర్శించారు. మాజీ సర్పంచులకు ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించక రాష్ట్రంలో అనేక మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రూ.700 కోట్ల పెండింగ్ బకాయిలను మాజీ సర్పంచులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. వెంకటప్పకు ఏదైనా జరిగితే, అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.



కామారెడ్డి జిల్లా బోర్లం క్యాంపు గురుకుల పాఠశాల గేటు ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థినుల తల్లిదండ్రులు

## గురుకులం ఎదుట తల్లిదండ్రుల ఆందోళన

- విద్యార్థినులకు రక్షణ లేదని ఆవేదన

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 16: గురుకుల సిబ్బంది నిర్లక్ష్యంతో పాఠశాలలో విద్యార్థినులకు రక్షణ కరువైందని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ మేరకు కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం బోర్లం క్యాంపు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల గేటు ఎదుట విద్యార్థినుల తల్లిదండ్రులు ఆదివారం ఆందోళనకు దిగారు. తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్తామని గేటు ఎదుట బైఠాయించారు. పాఠశాలలో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థినిని వరుసకు అన్న అయ్యే వ్యక్తి వచ్చి బయటికి తీసుకెళ్లిన ఘటన జరగడం ఆందోళన కలిగించిందని తల్లిదండ్రులు గుర్తుచేశారు. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంతోనే సదరు యువకుడు లోపలికి వచ్చాడని ఆరోపించారు. ఈ విషయమై సబ్‌కలెక్టర్ తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడారు. పాఠశాలను సందర్శించి, అక్కడే ఒక రోజు బస చేసి పరిస్థితులను తెలుసుకుంటానని భరోసా ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

## ఏపీలో తొలి జీబీఎస్ మరణం

- గుంటూరు జీజీహెచ్‌లో మహిళ మృతి

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తేతెలంగాణ) : ఆంధ్రప్రదేశ్‌లో తొలి జీబీఎస్ మరణం సంభవించింది. ప్రకాశం జిల్లాలోని కొమరోలు మండలం అలసందలపల్లి గ్రామానికి చెందిన కమలమ్మకు గులియన్ బారే సిండ్రోమ్ వ్యాధి సోకింది. గుంటూరు ప్రభుత్వ హాస్పిటల్‌లో రెండు రోజులపాటు చికిత్స పొంది ఆదివారం మృతి చెందింది. ఈనెల 3న గుంటూరు జీజీహెచ్‌కు కమలమ్మను తీసుకెళ్లగా ఆమెకు జీబీఎస్ వైరస్ సోకినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ వ్యాధి ప్రమాదకరమైన అంటు వ్యాధి కాకపోయినప్పటికీ.. కొన్ని సందర్భాల్లో మరణాలు సంభవిస్తాయని వైద్యులు తెలిపారు. ఈ వ్యాధి ఎందుకు సోకుతుందో ఎవరికీ అంతుపట్టడం లేదని పేర్కొన్నారు.



సోయం వినీత్ (ఫైల్)



ములుగు జిల్లా పేరూరు మండల బాలుర ఆశ్రమ పాఠశాల వద్ద మృతిచెందిన విద్యార్థి తల్లి, కుటుంబసభ్యులు, గ్రామస్థులతో కలిసి ధర్నా చేస్తున్న ఏఎస్ఎస్, ఏఎస్పీ నాయకులు

## ఆశ్రమపాఠశాల విద్యార్థి మృతి

- వార్డెన్, హెచ్ఎం నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ
- న్యాయం చేయాలని ధర్నా

వాజేడు, ఫిబ్రవరి 16: ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు ఆశ్రమ బాలుర వసతిగృహంలో చదువుతున్న పేరూరుకు చెందిన సోయం వినీత్(13) శనివారం రాత్రి మృతిచెందాడు. విద్యార్థి తల్లి సోయం శైలకుమారి, మేనమామ తల్లడి శ్రీకాంత్ కథనం ప్రకారం.. పేరూరు బాలుర ఆశ్రమపాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వినీత్‌కు జ్వరం రావడంతో శుక్రవారం ఇంటికి వచ్చాడు. శనివారం వాంతులు, విరోచనాలు అవడంతో కుటుంబ సభ్యులు ధర్మవరం ఆర్ఎంపీ వద్ద చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో ఆర్ఎంపీ సూచన మేరకు ఏటూరునాగారం వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్నా హాస్టల్ నిర్వాహకులు తమకు తెలియజేయలేదని, ట్యాబ్లెట్స్ వేయించి, పరిస్థితి చేయి దాటాక ఇంటికి పంపించారని వినీత్ తల్లి ఆరోపించారు. మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివారం వినీత్ తల్లితోపాటు బంధువులు, ఆదివాసీ నవ నిర్మాణసేన రాష్ట్ర నాయకుడు నరసింహమూర్తి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకుడు ఉయిక శంకర్ హాస్టల్ ఆవరణలో ధర్నా నిర్వహించారు.

## సస్పెన్షన్ అధికారికి ఆన్‌డ్యూటీ

- విద్యాశాఖలో విపరిణామం
- వెల్లువెత్తుతున్న విమర్శలు

హైదరాబాద్, ఫిబ్రవరి 16(నమస్తే తెలంగాణ): పాఠశాల విద్యాశాఖలో సస్పెండైన ఓ అడిషనల్ డైరెక్టర్‌కు.. ఆన్‌డ్యూటీ సదుపాయం కల్పించడం విమర్శలకు దారితీస్తున్నది. సస్పెన్షన్ కాలానికి కూర్చోబెట్టి పూర్తి జీతాన్ని చెల్లించడంపై తీవ్రవిమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పుడు ఈ వ్యవహారం విద్యాశాఖలో హాట్‌టాపిక్‌గా మారింది. ఇటీవల పాఠశాల విద్యాశాఖలో ఏడీపై పెద్దఎత్తున ఆరోపణలు రావడంతో ఆయన్ను సస్పెండ్ చేశారు. తర్వాత కొంతకాలానికి సస్పెన్షన్‌ను ఎత్తివేసి పోస్టింగ్ ఇవ్వలేదు. సదరు అధికారి కోర్టుకెళ్లడంతో పోస్టింగ్ సైతం ఇచ్చారు. సస్పెన్షన్ కాలాన్ని ఆన్‌డ్యూటీగా పరిగణిస్తూ ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులను జారీచేసింది. సస్పెన్షన్‌లో ఉన్న కాలంలోనూ పూర్తివేతనం చెల్లిస్తారు. ఆ అధికారిని ఎందుకు సస్పెండ్ చేసినట్టు, ఎందుకు ఆన్‌డ్యూటీ కల్పించినట్టు అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.